నీరు..నిబంధనలు పట్టించుకోరు!

- శుద్ధజలం పేరుతో నాణ్యత లేని నీరు విక్రయం
- ప్రజారోగ్యంతో చెలగాటం ఆడుతున్న వాటర్ ప్లాంట్ నిర్వాహకులు
- పట్టించుకోని అధికారులు


ముదిగుబ్బలో ఏర్పాటు చేసిన వాటర్ ప్లాంట్

ముదిగుబ్బ: మండలంలో శుద్ధ జలం పేరుతో వాటర్ ప్లాంట్ల నిర్వాహకులు జనరల్ వాటర్‌ను సరఫరా చేస్తూ ప్రజా రోగ్యంతో చెలగాటమాడుతున్నారు. ఏ మాత్రం నాణ్యతా ప్రమాణాలు పాటించకుండా నీటిని విక్రయిస్తున్నారు. సీజనల్‌వ్యాధులు ప్రబలుతున్న ప్రస్తుత తరుణంలో నాణ్యత లేని నీటితో ప్రాజరోగ్యాన్ని ప్రమాదంలో పడేస్తున్నారు. నీటి దోపిడీని అరికట్టాల్సిన అధికారులు మామూళ్ల మత్తులో జోగుతున్నట్లు విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ముదిగుబ్బ మండలంలో 15 వరకు వాటర్ ప్లాంట్‌లున్నాయి. ఆయా గ్రామాల్లో ఆటోల ద్వారా నీటిని సరఫరా చేస్తున్నారు.

ఐఎస్‌ఐ గుర్తింపు లేదు

మండలంలో ఏర్పాటు చేసిన ప్లాంట్లలో చాలా వాటికి ఐఎస్‌ఐ గుర్తింపు లేదు. ప్రతి ప్లాంట్‌లో నీటిని నిల్వ చేసే ట్యాంక్ స్టెయిన్‌లెస్ స్టీల్ ఉండాలన్న ప్రధాన నిబంధన ఎక్కడా అమలు కావడం లేదు. దీంతో ప్రజలు ఆయా ప్లాంట్లలో అరకొర శుద్ధి చేసిన నీళ్లను కొనుగోలు చేసి అనారోగ్యానికి గురవుతున్నారు. ఆటోల్లో మినరల్ వాటర్ పేరుతో ఒక్కో క్యాన్‌ను రూ.10 నుంచి రూ.20 వరకు విక్రయిస్తున్నారు.

నీటి దోపిడీ అరికట్టాలి



నాణ్యత లేని ప్యూరిఫైడ్ వాటర్‌ను అధిక ధరలకు విక్రయిస్తున్నారు. నిబంధనల ప్రకారం నీటిని శుద్ధి చేయకుండా ప్రజారోగ్యంతో చెలగాటమాడడం సరికాదు. అధికారులు నీటి దోపిడీని అరికట్టాలి. నిబంధనలను పాటించేలా ప్లాంట్ యజమానులకు ఆదేశాలు ఇవ్వాలి.
– రమేష్, ముదిగుబ్బ

తనిఖీలకు ఆదేశాలిచ్చాం



పంచాయతీల్లో ఏర్పాటు చేసిన వాటర్ ప్లాంట్లను పంచాయితీ కార్యదర్శులు తరచూ తనిఖీలు చేసేలా ఆదేశాలు ఇచ్చాం. పంచాయితీల్లో అందుబాటులో వున్న కార్యదర్శులు వాటర్ ప్లాంట్లను తనిఖీలు చేస్తున్నారు. ఎక్కడైనా ఫిర్యాదులు ఉన్నట్లయితే కార్యదర్శులకు సమాచారం ఇవ్వాలి. – విజయ్ భాస్కర్, ఎంపీడీఓ ముదిగుబ్బ

నాణ్యతా ప్రమాణాలు ఇలా..



- గ్రామ పంచాయితీల్లో అనుమతి తీసుకున్నాకే వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేయాలి.
- వాటర్ క్యాన్ మీద నీటిని శుద్ధి చేసిన తేదీ, బ్యాచ్ నంబర్‌ను నమోదు చేయాలి. ప్రతి నెలా శానిటరీ అధికారులు పరీక్షించి ఆ నీటిని బీఐఎస్(బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్స్)కు పంపాలి.
- వాటర్ ప్లాంట్ ప్రారంభించాలంటే ఐఎస్‌ఐ నిబంధనలు తప్పక పాటించాలి.
- ప్లాంట్‌లో మూడు వేల లీటర్ల సామర్థ్యం కలిగిన ట్యాంకులు ఏర్పాటు చేయాలి. శుద్ధి చేసిన నీటిని నిల్వ చేసేందుకు 304 గ్రేడ్ స్టెయిన్‌లెస్ స్టీల్ ట్యాంకులు మాత్రమే ఉపయోగించాలి.
- నీటిలో పీహెచ్ శాతం ఎంత ఉందో పరీక్షించాలి. పీహెచ్ శాతం 75 శాతం తగ్గితే ఆ నీటిని తాగిన వారు కిడ్నీ సంబంధిత వ్యాధుల బారిన పడే అవకాశముందని వైద్యులు చెపుతున్నారు.

స్వామి వివేకానందుడిని ఆదర్శంగా తీసుకోవాలి


విజేతలకు ప్రశంసాపత్రాలు అందించిన దృశ్యం

కదిరి అర్బన్: యువత స్వామి వివేకానందుడిని ఆదర్శంగా ముందుకెళ్లాలని ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ పేర్కొన్నారు. బుధవారం బ్లూమూన్ కళాశాలలో నెహ్రూ యువ కేంద్రం, బ్లూమూన్ విద్యాసంస్థల ఆధ్వర్యంలో జిల్లాస్థాయి యువ ఉత్సవ్ కార్యక్రమం జరిగింది. ఎమ్మెల్యేతో పాటు ఆర్డీఓ వీఎస్ శర్మలు హాజరై మాట్లాడారు. జాతి, దేశ భవిష్యత్తు యువతపై ఆధారపడి ఉందన్నారు. మారుతున్న కాలానికి అనుగుణంగా యువత ఆలోచనా విధానం ఉండాలన్నారు. ప్రతి ఒక్కరూ వికసిత భారత్ కోసం పాటుపడాలన్నారు. రెండు రోజులుగా నిర్వహించిన సైన్స్ మేళా, యంగ్ రైటర్స్ కాంటెస్ట్, యంగ్ ఆర్టిస్ట్ కాంటెస్ట్, ఫొటోగ్రఫీ తదితర పోటీల్లో గెలుపొందిన విజేతలకు నగదు బహుమతితో పాటు ప్రశంసాపత్రాలను అందజేశారు. జిల్లా యువ అధికారి మణికంఠ, బ్లూమూన్ విద్యాసంస్థల అధినేత శివశంకర్, నెహ్రూ యువకేంద్రం అధికారి శ్రీనివాసులు, జాతీయ యువజన అవార్డు గ్రహీత బిసాతి భరత్, విద్యార్థులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలను అరికడదాం

కనగానపల్లి: ఆడ పిల్లలు భవిష్యత్తుకు అగాధంగా మారుతున్న బాల్య వివాహాలను అరికడదామని అంగన్‌వాడీ సిబ్బంది ప్రతిజ్ఞ చేశారు. బాల్య వివాహరహిత ఆంధ్రప్రదేశ్ కార్యక్రమంలో భాగంగా బుధవారం మండలంలోని పలు అంగన్‌వాడీ కేంద్రాల్లో బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక పాఠశాలలో చదువుకొంటున్న కిషోర బాలికలతో సమావేశం నిర్వహించారు. బాల్య వివాహాల వల్ల జరిగే అనర్థాలను వివరించి, ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లు పాల్గొన్నారు.

వ్యక్తికి గాయాలు

చెన్నేకొత్తపల్లి: మండల కేంద్రానికి సమీపంలో 44వ నంబర్ జాతీయ రహదారిపై బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి గాయపడ్డాడు. వివరాలు.. మండల పరిధిలోని నామాల గ్రామానికి చెందిన అశ్వర్థ నారాయణ ద్విచక్రవాహనంలో మండల కేంద్రానికి బయలుదేరాడు. జాతీయ రహదారిపైకి వెళ్లే ప్రయత్నంలో లారీని గమనించలేదు. లారీ డ్రైవర్ ఒక్కసారిగా వాహనాన్ని పక్కకు తిప్పడంతో అశ్వర్థ నారాయణ కిందపడ్డాడు. స్వల్పంగా గాయపడిన అశ్వర్థ నారాయణను ఓ ప్రైవేట్ వాహనంలో చెన్నేకొత్తపల్లి ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

తప్పిన ప్రమాదం

ఎన్పీకుంట: పవర్‌గ్రిడ్ కార్యాలయం సమీపంలో కారు బోల్తాపడిన ఘటనలో ప్రమాదం తప్పింది. వివరాలు..ఏపీ 02 సీఏ 8055 నెంబరు గల కారు రాయచోటి నుంచి కదిరికి బయలుదేరింది. పవర్‌గ్రిడ్ కార్యాలయం సమీపంలోకి రాగానే అదుపుతప్పి బోల్తాపడింది. ఘటనలో కారులో ప్రయాణిస్తున్న ఇద్దరు వ్యక్తులు సురక్షితంగా బయటపడ్డారు. కారు డ్రైవర్ చంద్రశేఖర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

ప్రకృతి వ్యవసాయం మేలు

తలుపుల: ప్రకృతి వ్యవసాయం రైతులకు అన్నివిధాలా శ్రేయస్కరమని సీఎస్‌ఏ సంస్థ సభ్యురాలు శ్యామల పేర్కొన్నారు. మండలంలోని గొల్లపల్లి తండాలో బుధవారం సీఎస్‌ఏ సంస్థ ఆధ్వర్యంలో ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పించారు.

క్లుప్తంగా

విద్యుత్ సబ్‌స్టేషన్‌పై అవగాహన


సబ్ స్టేషన్ పనితీరును వివరిస్తున్న దృశ్యం

తాడిమర్రి: స్థానిక 33 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్‌లో బుధవారం విద్యార్థులకు విద్యుత్ సబ్ స్టేషన్ ద్వారా ప్రజలకు అందించే సేవలపై సబ్ స్టేషన్ సిబ్బంది అవగాహన కల్పించారు. ఇండస్ట్రియల్ విజిట్‌లో భాగంగా స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల ఒకేషనల్ ట్రైనర్స్ బోణాల ప్రసాద్, దుడ్డి రాజశేఖర్‌ల ఆధ్వర్యంలో తొమ్మిది, పదో తరగతి విద్యార్థులను విద్యుత్ సబ్ స్టేషన్‌కు తీసుకెళ్లారు. ఈ సందర్భంగా సీనియర్ లైన్‌మేన్ దాదావలి మాట్లాడుతూ సబ్ స్టేషన్ ద్వారా ఇళ్లు, వ్యవసాయ మోటర్లు, పరిశ్రమలకు విద్యుత్ సరఫరా చేస్తామన్నారు. విద్యుత్ సరఫరాలో ఆటంకాలు ఎదురు కాకుండా ట్రాన్స్ ఫార్మర్లను ఏర్పాటు చేస్తామన్నారు. మీటర్ల ద్వారా విద్యుత్ వాడకం యూనిట్ల ద్వారా లెక్కించి బిల్లులు వసూలు చేస్తామని వివరించారు. హెచ్‌ఎం అరుణ, పీడీ వేణుగోపాల్, ఉపాధ్యాయుడు జీవరత్నం పాల్గొన్నారు.

'బాల్ వివాహ్ ముక్త్ భారత్'


మాట్లాడుతున్న ఎంపీడీఓ పోలప్ప

కదిరి అర్బన్: ఎగువపల్లి ప్రాథమిక పాఠశాలలో బుధవారం 'బాల్ వివాహ్ ముక్త్ భారత్' కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఎంపీడీఓ పోలప్ప మాట్లాడుతూ బాల్య వివాహాలను అరికట్టడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమన్నారు. బాల్యవివాహాలు సాంఘిక దురాచారంతోపాటు నేరమన్నారు. బాల్య వివాహం ఎక్కడైనా జరుగుతుంటే సామాజిక బాధ్యతగా ప్రతి ఒక్కరూ అడ్డుకోవాలన్నారు. అనంతరం విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.


చెన్నేకొత్తపల్లి: బాల్య వివాహాలకు అడ్డుకట్ట వేయాలని ఐసీడీఎస్ సిబ్బంది ప్రజలకు సూచించారు. బుధవారం ఎంపీడీఓ కార్యాలయం, ఐసీడీఎస్, గ్రామ సచివాలయాల సిబ్బంది స్థానిక బస్టాండ్‌లో మానవహారం నిర్వహించారు. అధికారులు మాట్లాడుతూ.. బాల్య వివాహాలు చేయడం నేరం అన్నారు. బాలికల విద్య, రక్షణ, ఆరోగ్యం, అభివృద్ధికి బాల్యవివాహాలు ఆటంకమన్నారు. అనంతరం ప్రతిజ్ఞ చేశారు.

విద్యార్థులకు వైద్య పరీక్షలు


విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న ఆరోగ్య సిబ్బంది

తనకల్లు: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో రాష్ట్రీయ బాలల ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా కొక్కంటి పీహెచ్‌సీ వైద్యులు లోకేశ్వర్‌రెడ్డి, ధర్మరాజు ఆధ్వర్యంలో బుధవారం విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ నెల 30 వరకు పాఠశాలలోని 375 మంది విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తామన్నారు. చెవిటి, మూగ, అంధత్వం, శ్వాస, రక్తహీనత తదితర వ్యాధులతో బాధపడేవారిని గుర్తించి, ప్రత్యేక చికిత్సలు చేయించనున్నట్లు తెలిపారు. వైద్య పరీక్షల అనంతరం వారికి హెల్త్ ఐడీ కార్డులను అందజేస్తామన్నారు. ఎంఎల్‌హెచ్‌పీలు నాగమల్లీశ్వరి, మమత, సూపర్‌వైజర్ సూర్యనారాయణరెడ్డి, హెల్త్ అసిస్టెంట్లు మోహన్‌రెడ్డి, ముసల్‌రెడ్డి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

నిల్వ ఉన్న నీటిలోనే దోమల ఉత్పత్తి


ప్రజలకు అవగాహన కల్పిస్తున్న జిల్లా మలేరియా నివారణ అధికారి ఓబులు

ధర్మవరం అర్బన్: ఇళ్లలోని నీళ్ల తొట్టెలు, డ్రమ్ముల్లో నీటిని నిల్వ ఉంచితే దోమలు ఉత్పత్తవుతాయని జిల్లా మలేరియా నివారణ అధికారి ఓబులు తెలిపారు. పట్టణంలో బుధవారం శారదానగర్, శాంతినగర్‌లలో ఆయన పర్యటించారు. అనంతరం హెల్త్ సెంటర్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇళ్ల వద్దనున్న తొట్టెలు, డ్రమ్ముల్లో నిల్వ ఉన్న నీటిని పరిశీలించి దోమలు వృద్ధి చెందిన నీటిని పారపోయించారు. ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ప్రజలకు జ్వరాలు వస్తే వెంటనే ఆసుపత్రులకు వెళ్లి వైద్యం చేయించుకోవాలని సూచించారు. ప్రతి శుక్రవారం డ్రైడే పాటించాలని తెలిపారు. సబ్ యూనిట్ అధికారి జయరాంనాయక్, ఎంపీహెచ్ఈఓ గిరిధర్‌రెడ్డి, సూపర్‌వైజర్ రమేష్ పాల్గొన్నారు.

అర్హులు ఓటరుగా నమోదు చేయించుకోండి


గాండ్లపెంటలో ఓటు హక్కుపై ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు


తనకల్లులో ఓటు హక్కుపై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

తనకల్లు: 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా తమ పేరును నమోదు చేయించుకోవాలని రెవెన్యూ అధికారులు అన్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులతో కలిసి బుధవారం జాతీయ రహదారిపై ఓటు హక్కుపై అవగాహనపై ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశంలోని ప్రతి పౌరునికి భారత రాజ్యాంగం ఓటు హక్కు ను కల్పించిందన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ చెన్నకేశవులు, వీఆర్వోలు మనోహర్, నజీర్, నరసింహులు, రఘునాథ్, సోముశేఖర్, వెంకరమణ, విద్యార్థులు పాల్గొన్నారు.

గాండ్లపెంట: మండల కేంద్రంలో బుధవారం తహసీల్దార్ బాబురావు ఆధ్వర్యంలో విద్యార్థులతో ఓటు హక్కుపై అవగాహనా ర్యాలీ నిర్వహించారు. స్థానిక ఉన్నత పాఠశాల నుంచి వైఎస్‌ఆర్ కూడలీ వరకూ ర్యాలీ సాగింది. ఎంఈఓ క్రిష్ణానాయక్ మాట్లాడుతూ 18 సంవత్సరాలు నిండిన యువతీ, యువకులు తమ ఓటును నమోదు చేసుకోవాలన్నారు. తహసీల్దార్ కార్యాలయ సీనియర్ సహాయకుడు జాఫర్, బీఎల్ఓలు అమానుల్లా సోమశేఖరరెడ్డి, ఉపాధ్యాయులు ముంతాజ్ అలీ, పీడీ పాపారాయుడు పాల్గొన్నారు.

నల్లచెరువు: ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు వజ్రాయుధం లాంటిదని తహసీల్దార్ రవికుమార్ పేర్కొన్నారు. మండల కేంద్రంలో ఓటరు హక్కుపై బుధవారం తహసీల్దార్ రవికుమార్, ఎంఈఓ తిరుపాల్‌నాయక్ ఆధ్వర్యంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుంచి వైఎస్సార్ కూడలి వరకూ భారీ ర్యాలీ నిర్వహించారు. ఆర్ఐ లక్ష్మీదేవి, ఉపాధ్యాయులు శ్రీనాథ్‌రెడ్డి, సుబహాన్, పీడీ షఫి, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఆర్డీఓ వెంకట సన్యాసి శర్మ

కదిరి అర్బన్: బ్లూమూన్ డిగ్రీ కళాశాలలో బుధవారం ఆర్డీఓ వెంకట సన్యాసి శర్మ ఆధ్వర్యంలో స్వీప్ కార్యక్రమం (సిస్టమాటిక్ వోటర్స్ ఎడ్యుకేషన్ అండ్ ఎలక్టోరల్ పార్టిసిపేషన్) కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఓటు హక్కు, ఓటుని ఎలా వినియోగించాలన్న అంశాలపై ఆర్డీఓ విద్యార్థులకు వివరించారు. యువతరం తమ ఓటుతో మంచి నాయకున్ని ఎన్నుకోవచ్చన్నారు. అనంతరం మానవహారం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో బ్లూమూన్ విద్యాసంస్థల అధినేత శివశంకర్, రెవెన్యూ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

జనన ధ్రువపత్రాల కోసం జనం పాట్లు


బర్త్ సర్టిఫికెట్ల కోసం పంచాయతీ కార్యాలయం వద్ద వేచి ఉన్న జనం

బత్తలపల్లి: జనన ధ్రువపత్రాల కోసం జనం అష్ట కష్టాలు పడుతున్నారు. ఉమ్మడి అనంతపురం జిల్లాకు చెందిన పలువురు బత్తలపల్లి ఆర్డీటీ ఆసుపత్రిలో ప్రసవాలు చెందారు. వారు జనన ధ్రువపత్రం పొందాలంటే బత్తలపల్లి పంచాయతీ కార్యాలయంలో తీసుకోవాల్సి ఉంది. దీంతో నెల రోజులుగా పంచాయతీ కార్యాలయం ప్రజలతో కిటకిటలాడుతోంది. ఆర్డీటీ ఆసుపత్రిలో జనన ధ్రువపత్రం తీసుకువచ్చి తహసీల్దార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ తీసుకోవాల్సి ఉంది. అక్కడ నుంచి పంచాయతీ కార్యాలయంలో తర్వాత జనన సర్టిఫికెట్‌ను నమోదు చేయించి అక్కడ ధ్రువపత్రం తీసుకోవాల్సి ఉంది. ఇదంతా జరగాలంటే దాదాపు 20 రోజులు సమయం పడుతోంది. అయితే పాఠశాలలో విద్యార్థులను ఉపాధ్యాయులు ఒత్తిడి చేస్తుండడంతో వారు తల్లిదండ్రులపై ఒత్తిడి తీసుకువస్తున్నారు. ఈ నేపథ్యంలో పిల్లల పరిస్థితిని అర్థం చేసుకున్న తల్లిదండ్రులు జనన ధ్రువపత్రం తీసుకునేందుకు డబ్బు ఎంతైనా ఖర్చు చేసేందుకు వెనుకాడడంలేదు. దీనిని గమనించిన పలువురు తల్లిదండ్రుల నుంచి అందినకాడికి దోచుకుంటున్నారు. పరిస్థితిని గమనించిన ఎంపీడీఓ నరసింహానాయుడు సచివాలయ ఉద్యోగులను ఏర్పాటు చేసి సర్టిఫికెట్లు త్వరగా అందేలా చర్యలు తీసుకుంటున్నారు.

'రాజకీయ లబ్ధి కోసం విమర్శలు తగదు'


విలేకరులతో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

ముదిగుబ్బ: జిల్లేడుబండ ప్రాజెక్ట్ మంత్రి సత్యకుమార్ రాజకీయ లబ్ధి కోసం గత ప్రభుత్వంపై విమర్శలు చేయడం తగదని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ సీపీ నారాయణరెడ్డి పేర్కొన్నారు. బుధవారం ఆయన మండల కేంద్రంలో ఆ ఆపార్టీ నాయకులతో కలిసి విలేకరులతో మాట్లాడారు. గత ప్రభుత్వంలో ధర్మవరం ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి చొరవతో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో రూ.680 కోట్ల నిధులను మంజూరు చేయించారన్నారు. దాదాపుగా పూర్తి కావొస్తున్న ప్రాజెక్ట్‌ను చూసి రైతులకు పరిహారం అందేలా చూస్తామని, ప్రాజెక్ట్ పూర్తి చేస్తామని చెప్పాల్సిన మంత్రి రాజకీయ లబ్ధి కోసం గత ప్రభుత్వంపై బురద జల్లడం ఎంతవరకూ సమంజసమని ప్రశ్నించారు. మంత్రి పర్యటన ద్వారా ఆగిపోయిన ప్రాజెక్ట్ పనులు ప్రారంభిస్తారని, తమకు పరిహారం అందుతుందని రైతులు ఆశించారన్నారు. అయితే మంత్రి ఇవేవీ పట్టించుకోకుండా రాజకీయాలకే పరిమితమయ్యారన్నారు. ప్రాజెక్ట్ పూర్తయితే 22 వేల ఎకరాలకు సాగునీరు, పరోక్షంగా 5 వేల ఎకరాలు సాగులోకి వస్తాయన్నారు. ఇప్పటికైనా మంత్రి రాజకీయాలు మాని ప్రాజెక్టును పూర్తి చేయించాలని కోరారు. సర్పంచ్ వెంగళరెడ్డి, నాయకులు పరంధామరెడ్డి, చంద్రాయుడు, శ్రావణ్‌కుమార్, కుళ్లాయప్ప, రామదాసునాయక్, రవీ నాయక్, నాగేంద్రనాయక్, తదితరులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి బాస్కెట్‌బాల్ పోటీలకు ఎంపిక


క్రీడాకారిణిని అభినందిస్తున్న అసోసియేషన్ ప్రతినిధులు

ధర్మవరం అర్బన్: జాతీయస్థాయి బాస్కెట్‌బాల్ పోటీలకు ధర్మవరం క్రీడాకారిణి ఎంపికై నట్లు ధర్మాంబ బాస్కెట్‌బాల్ అసోసియేషన్ ఆర్గనైజింగ్ కార్యదర్శి శెట్టిపి జయచంద్రారెడ్డి తెలిపారు. పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలోని బాస్కెట్‌బాల్ కోర్టులో బుధవారం జాతీయస్థాయికి ఎంపికైన క్రీడాకారిణి కిరణ్మయిని అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 29 నుంచి డిసెంబర్ 5 వరకు కలకత్తాలో జరిగే 39వ యూత్ జాతీయస్థాయి పోటీల్లో పాల్గొనే ఆంధ్రప్రదేశ్ బాలికల జట్టుకు కిరణ్మయి ఎంపికకావడం హర్షణీయమన్నారు. జాతీయస్థాయి బాస్కెట్‌బాల్ పోటీల్లో రాణించి ధర్మవరానికి మంచి పేరు తీసుకురావాలని ధర్మాంబ బాస్కెట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు మేడాపురం రామిరెడ్డి, కార్యదర్శి వాయల్పాడు హిదయ్‌తుల్లా, కోచ్ సంజయ్‌లు ఆకాంక్షించారు.

సమన్వయంతో మండలాభివృద్ధికి కృషి చేయండి


సమావేశంలో పాల్గొన్న ఎంపీపీ, జెడ్పీటీసీ

ఓడీచెరువు: అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో మండలాభివృద్ధికి కృషి చేయాలని ఎంపీపీ పర్వీన్‌భాను కోరారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ముందుగా అధికారులు తమ శాఖల ప్రగతిని చదివి వినిపించారు. ఉపాధి హామీ కింద 100 రోజులు పనిచేసుకున్న కుటుంబంలోని నిరుద్యోగ యువతీ యువకులకు నైపుణ్యాభివృద్ధి పథకం కింద ప్రభుత్వం అనేక ప్రోత్సాహకాలను అందిస్తున్నట్లు ఎంపీడీఓ రాబర్ట్ విల్సన్, ఏపీఓ తెలియజేశారు. సర్పంచ్ జగన్‌మోహన్‌చౌదరి కల్పించుకొని ఉపాధి పనుల్లో వంద రోజులు పూర్తి చేసుకున్న కూలీల జాబితాను ఎందుకు గోప్యంగా ఉంచుతున్నారని ప్రశ్నించారు. ఇంతలో వెంకటాపురం సర్పంచు కలగజేసుకోవడంతో కాసేపు ఇద్దరి మధ్య వాగ్వాదం జరిగింది. జెడ్పీటీసీ దామోదర్ రెడ్డి, వైస్ ఎంపీపీ లక్ష్మీదేవి, తహసీల్దార్ అనంతాచారి, ఎంఈఓలు రమణ, సురేష్ కుమార్, సర్పంచులు, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

అవినీతి, అక్రమాలకు పాల్పడితే సహించం


మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెంకటప్రసాద్

కదిరి టౌన్: ప్రభుత్వ ఉద్యోగులు అవినీతి, అక్రమాలకు పాల్పడితే సహించమని కదిరి ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ హెచ్చరించారు. బుధవారం కదిరి తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ మురళీకృష్ణ, సబ్ రిజిస్ట్రార్ శ్రీనివాసులతో కలిసి డాక్యుమెంట్ రైటర్లకు సమావేశం నిర్వహించారు. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో అనధికార, అప్రూవ్ లేని లేఔట్లు రిజిస్ట్రేషన్లు చేయొద్దన్నారు. డాక్యుమెంట్ రైటర్లు సర్వేనంబర్లు తారుమారు చేసి ఫొటోలు మార్చివేసి రిజిస్ట్రేషన్లు చేయొద్దన్నారు.

సంక్షిప్త సమాచారం

కర్ణాటక మద్యం స్వాధీనం

ధర్మవరం అర్బన్: డి.చెర్లోపల్లి క్రాస్ వద్ద బుధవారం కర్ణాటక మద్యం ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ సీఐ చంద్రమణి తెలిపారు. పత్యాపురానికి చెందిన బాలకృష్ణను అదుపులోకి తీసుకుని అతని నుంచి 20 కర్ణాటక మద్యం ప్యాకెట్లు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామన్నారు.

పీహెచ్‌సీ తనిఖీ

ముదిగుబ్బ: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని బుధవారం ఎంపీపీ ఆదినారాయణ పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రజలు అందుతున్న ఆరోగ్య సేవలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆసుపత్రి ప్రాంగణంలో పిచ్చి మొక్కలు ఉండడం చూసి ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని వైద్య సిబ్బందికి సూచించారు. ఎంపీటీసీ మంజునాథ్, పాడరాళ్లపల్లి సర్పంచ్ నాగభూషణ తదితరులు పాల్గొన్నారు.

డ్రోన్ కెమెరా ఆపరేటింగ్‌పై శిక్షణ

చెన్నేకొత్తపల్లి: రామగిరి సర్కిల్ పరిధిలోని కనగానపల్లి, రామగిరి, చెన్నేకొత్తపల్లి మండలాల పోలీసులకు బుధవారం డ్రోన్ కెమెరా ఆపరేటింగ్‌పై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. చెన్నేకొత్తపల్లిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో జరిగిన కార్యక్రమంలో రామగిరి సీఐ శ్రీధర్ మాట్లాడారు. డ్రోన్ కెమెరాలను ఉపయోగించి చట్టవ్యతిరేక కార్యక్రమాలు జరగకుండా గుర్తించే అవకాశం ఉందన్నారు. ముఖ్యంగా మనిషి వెళ్లలేని ప్రాంతాల్లో డ్రోన్ కెమెరా వెళ్తుందన్నారు. కార్యక్రమంలో చెన్నేకొత్తపల్లి, రామగిరి, కనగానపల్లి ఎస్ఐలు సత్యనారాయణ, సుధాకర్ యాదవ్, రిజ్వాన్ సిబ్బంది పాల్గొన్నారు.

వెబ్ డెవలపర్ కోర్సుపై ఉచిత శిక్షణ

కదిరి అర్బన్: స్థానిక ఎస్టీఎస్ఎన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతీయువకులకు వెబ్ డెవలపర్ కోర్సులో ఉచిత శిక్షణ ఇవ్వనున్నారు. ఈమేరకు కళాశాల ప్రిన్సిపాల్ డా. స్మిత, డీఎస్‌డీఓ హరిక్రిష్ణ బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఆసక్తిగల యువతీ యువకులు స్కిల్ హబ్ కో ఆర్డినేటర్ నాగార్జున(సెల్ 9390176421)ను సంప్రదించాలని కోరారు.

వ్యక్తికి తీవ్ర గాయాలు

తనకల్లు: కనసానివారిపల్లి వద్ద బుధవారం బైక్ అదుపుతప్పి కిందపడటంతో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. వివరాలు...ఎన్పీకుంట మండలం యాదులోల్లపల్లికి చెందిన రమణ కొక్కంటిక్రాస్‌లో పని ముగించుకుని స్వగ్రామానికి బయలుదేరాడు. గ్రామం సమీపంలోకి రాగానే బైక్ అదుపుతప్పి కిందపడ్డాడు. ప్రమాదంలో రమణ ముఖానికి, తలకు బలమైన గాయాలయ్యాయి. వందేమాతం టీం సభ్యులు క్షతగాత్రున్ని తమ ఉచిత అంబులెన్స్‌లో ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

పారిశుధ్య పనుల అడ్డగింత

ముదిగుబ్బ: పంచాయతీ పారిశుధ్య కార్మికుల సమ్మె నేపథ్యంలో అధికారులు మినీ జీప్సీతో చెత్తాచెదారం తొలగించేందుకు యత్నించగా కార్మికులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా అధికారులతో సీఐటీయూ నాయకులు వాగ్వాదానికి దిగారు. పారిశుధ్య కార్మికుల డిమాండ్లను నేరవేర్చాలని మోకాళ్లపై నిలబడి నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి ఆటో పెద్దన్న, సీఐటీయూ మండల కార్యదర్శి బండల వెంకటేష్, నాయకులు పోతులయ్య, మధుసూదన్‌రెడ్డి, వెంగముని, బాబ్‌జాన్, రఫి, నౌసాద్, ముత్యు, రహీం, పంచాయితీ కార్మికులు పాల్గొన్నారు.

రహదారి ఏర్పాటుకు భూమి పూజ

పుట్టపర్తి టౌన్: కొత్తచెరువు మండలం ఓబుళదేవరచెరువు గ్రామంలో అహోబిలం లక్ష్మీనరసింహస్వామి ఆలయ రోడ్డు ఏర్పాటుకు పెనుకొండ ఏజీపీ భాస్కర్‌రెడ్డి భూమి పూజ చేశారు. ఆలయానికి ప్రధాన రహదారి నుంచి ఒక కిలోమీటర్ దూరం ఉంది. రోడ్డు నిర్మాణానికి భక్తులు, దాతలు సహకరించాలని ఏజీపీ కోరారు. కార్యక్రమంలో విశ్రాంత ఉపాధ్యాయుడు నంజిరెడ్డి, భక్తులు ఓబిరెడ్డి, రాంభూపాల్‌రెడ్డి, చెన్నకేశవరెడ్డి, కృష్ణారెడ్డి, అశ్వర్థరెడ్డి, సూర్యనారాయణరెడ్డి, మోహన్‌రెడ్డి, రవీంద్రరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.